వైభవంగా సూర్యదేవుని వైశాఖ ఆదివార పూజలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : శృంగవరపుకోట మండల కేంద్రమైన ఎస్.కోట సూర్య దేవాలయంలో వైశాఖ ఆదివారం పురస్కరించుకొని సూర్య దేవునికి ఆలయ ధర్మకర్త ముక్కు జానకి బాయి, గార్లపాటి సత్య సాయి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు విన్నకోట సూరిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వైశాఖ ఆదివారం పురస్కరించుకొని భక్తులు సూర్యదేవునికి పెసలు విసిరి మామిడిపండ్లను సమర్పించారు. ఈ రోజున స్వామివారిని పూజిస్తే ఆయురారోగ్యాలు సంపదలు కలుగుతాయని భక్తులు నమ్ముతారు. ఈ పర్వదినం పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

చీపురుపల్లికి కింగెవరు ?



రాజకీయ దిగ్గజాల పోటీతో సర్వత్రా ఆసక్తి

(విశాలాంధ్ర-విజయనగరం)

రాజకీయాలలో ఇద్దరు దిగ్గజాల మధ్య పోటీ జరిగితే... అధికార విపక్షాలకు ఆ సమరం ప్రతిష్టాత్మకమైతే....రణరంగం ఆద్యంతం రసవత్తరమే....ఫలితం పై ఎడతెగని ఉత్కంఠే.

అందరి చూపూ అటువైపే.

విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం అధికార పక్ష అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ బరిలోకి దిగితే, సీనియర్ నేత కిమిడి కళా వెంకటరావును టీడీపీ కి పోటీకి దింపింది. రాజకీయాల్లో ఇద్దరూ సీనియర్లే. మంత్రులుగా పనిచేసిన అనుభవజ్ఞులే. అందుకే చీపురుపల్లి ఫలితంపై జిల్లా అంతా ఆసక్తిగా చూస్తోంది. ఎవరికి ఏ అంశం కలిసివస్తుందో, విజయం ఎవరిని వరిస్తుందో అనే ఊహాగానాలకు, చర్చలకు, మరో అడుగు ముందుకు పడి బెట్టింగ్‌లకు తావిస్తోంది. రాజకీయ చాణుక్యునిగా పేరొందిన బొత్స సత్యనారాయణ చీపురుపల్లి నియోజకవర్గం నుంచి 2004లో కాంగ్రెస్ అభ్యర్థి గా పోటీ చేసారు. టీడీపీ అభ్యర్థి గద్దె బాబూరావు పై విజయం సాధించారు. 2009 లోనూ విజయం సాధించిన బొత్స 2014లో సమైక్యాంధ్ర ప్రభావంతో టీడీపీ అభ్యర్థి కిమిడి మృణాళిని చేతిలో ఓటమి చెందారు. 2019లో కిమిడి నాగార్జున పై విజయం సాధించారు. మంత్రివర్గంలో కీలకనేతగా జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో ఐదేళ్ల పాటు మంత్రి గా కొనసాగారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యారంగంలో తీసుకువచ్చిన సంస్కరణలు, సంక్షేమ పథకాల నేపథ్యంలో మహిళా ఓటర్ల మద్దతు బొత్సను గట్టెక్కిస్తాయని ఆయన అభిమానులు అంచనా వేస్తున్నారు. ఇక టీడీపీ విషయానికొస్తే కిమిడి నాగార్జునను కాదని బొత్సకు ధీటైన అభ్యర్థి గా భావించి కిమిడి కళా వెంకటరావును ఆ పార్టీ అధిష్టానం ఎన్నికల రణ రంగంలోకి దింపింది. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ అభ్యర్థి గా ఉణుకూరు నియోజకవర్గం నుంచి కళా వెంకటరావు. విజయాలను నమోదు చేసారు. 1983, 1985, 1989, 2004 ఎమ్మెల్యే గా గెలుపొందారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వాణిజ్యపన్నులు, మున్సిపాలిటీలు, హోంశాఖా మంత్రిగా పనిచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా, 1998 నుండి 2004 వరకు రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో చిరంజీవి నేతృత్వంలోని ప్రజారాజ్యం పార్టీలో చేరారు. 2009లో నియోజకవర్గ పునర్విభజనతో ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుండి ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిఓటమి పొందారు. ఈసారి పొత్తులో భాగంగా ఎచ్చర్ల టికెట్ బిజెపి కి కేటాయించడంతో చీపురుపల్లి నుంచి బరిలోకి దిగారు.

మెరకముడిదాం....కీలకం

చీపురుపల్లి నియోజకవర్గంలో బొత్స, కళా వెంకటరావు మధ్య టైట్ ఫైట్ అనే టాక్ ప్రచారంలో వుంది. విజయం ఎవరిని వరించినా మెజారిటీ తక్కువగానే ఉంటుందనే మాట విన్పిస్తోంది. నియోజకవర్గంలో ఒక్కో మండలంలో ఒక్కో పార్టీ వైపు ఓటర్లు మొగ్గుచూపారనే ప్రచారం బలంగా ఉంది. మొదటి నుంచి గరివిడి మండలం తమకు కి వెన్నుదన్నుగా వుంటోందని ఈ ఎన్నికలలో కూడా అక్కడ కొంత ఆధిపత్యం ఉంటుందనీ టీడీపీ భావిస్తోంది. గుర్ల మండలంలో కూడా ఇరు పార్టీల బలాబలాలు సమానంగా వున్నాయంటున్నారు. చీపురుపల్లిలో దాదాపు ఇటువంటి పరిస్థితే ఉందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మెరకముడిదాం మండల ఓటింగ్ డిసైడింగ్ ఫాక్టర్ అవుతుందంటున్నారు. మెరకముడిదాం మండలంలో వైసీపీ ఆధిపత్యం ఉన్నప్పటికీ ఈసారి ఓటింగ్ ఎలా జరిగిందనేది కీలకం. ఈ మండలంలో 46,869 మంది ఓటర్లుండగా, 38,744 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గం మొత్తంమీద పురుషులతో దాదాపు సమానంగా మహిళలు కూడా ఓటింగ్ లో పాల్గొన్నారు. ఓటు వేసిన వారిలో 85,812 మంది పురుషులు కాగా 85,730 మంది మహిళా ఓటర్లున్నారు. మహిళా ఓటర్లు తమకు మద్దతు పలుకుతారని వైసీపీ నాయకులు భావిస్తున్నారు. టీడీపీ నాయకులు, అభిమానులు కూడా దాదాపు ఇటువంటి అంచనాలతోనే ఉన్నారు. గరివిడి, గుర్ల మండలాలు తమకు కలిసివస్తాయనీ, చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల్లో కూడా రాజకీయ పరిస్థితులు మారాయని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమకు విజయావకాశాలున్నాయనీ లెక్కలు వేసుకుంటున్నారు. జయాపజయాలపై గణాంకాలు విశ్లేషణలూ ఎలా ఉన్నప్పటికీ ఈ ఎన్నికలలో ఓటరు ఎవరివైపున్నాడనేది అంచనాలకు అందడం లేదనేది ఇరు పక్షాల నుంచి కొసమెరుపుగా విన్పిస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా పోస్టల్ బ్యాలెట్‌ను తెరిచారు

కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కలిశెట్టి, అదితి

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: విజయనగరం తహసీల్దార్ కార్యాలయంలో గల పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ ను కేవలం వైసిపి నాయకుల సమక్షంలో ఈ నెల 16న సుమారు మధ్యాహ్నం 3 గంటల సమయంలో తెరవడం, ఈ విషయమై టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి మరియు ఇతర ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని. కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కలిశెట్టి అప్పలనాయుడు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు అన్నారు. ఆదివారం అశోక్ బంగ్లాలో నిర్వహించి పత్రికా సమావేశంలో మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో గల పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ తెరవడానికి కేవలం వైసిపి వారికి మాత్రమే సమాచారం ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి మాత్రమే కాదు ఏ ఇతర ఎమ్మెల్యే అభ్యర్థులకు సమాచారం రాలేదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యే అల్లుడు, డిప్యూటీ మేయర్ భర్త అయిన కౌశిక్ పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ లోపల ఫోన్ మాట్లాడరన్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిందని తెలిపారు. ఈ విషయాలను అన్ని పరిశీలిస్తే మాకు పూర్తిగా అనుమానం కలుగుతుందన్నారు. విజయనగరం అసెంబ్లీ ఆర్వో ఇప్పుడు కొత్తగా ఒక లెటర్ చూపిస్తున్నారు, అది ఏమనగా వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి తరపున మామిడి అప్పలనాయుడు, ఈశ్వర్ కౌశిక్ హాజరవుతారని తెలుపుతూ విజయనగరం అసెంబ్లీ ఆర్వోకి వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి లెటర్ రాసినట్టు ఇప్పుడు చూపిస్తున్నారన్నారు. కానీ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నుండి వచ్చిన లెటర్ గురించి ఆ రోజు ఎవరు చూపించలేదు, మాట్లాడలేదన్నారు. ఇప్పుడు కొత్తగా ఈ లెటర్‌ను సృష్టించలేదని నమ్మకం ఏమిటని ప్రశ్నించారు. ఆ రోజు మేము చాలా సమయం తహసీల్దార్ ఆఫీస్‌లో ఉన్నప్పటికీ ఈ విషయం మాకు ఎందుకు తెలియజేయలేదన్నారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి కి తహసీల్దార్ కార్యాలయానికి 16-5-2024 న మధ్యాహ్నం 3 గంటలకు హాజరుకావాలని తెలిపినట్టు ఈ సందర్భంగా స్పష్టమవుతుందన్నారు. మరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని అయిన నాకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తెదేపా ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు గారి జనరల్ ఏజెంట్ ధవల వెంకటరావుకి వాట్సాప్ ద్వారా విజయనగరం పార్లమెంట్ ఆర్వో నుండి వచ్చిన నోటీసు : వీరికి 16వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు విజయనగరం కలెక్టర్ ఆఫీస్ ఆడిటోరియం వద్దకు హాజరు కావాలని నోటీసు లో తెలిపారన్నారు. పై విషయాలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది అని తెలిపారు. ప్రత్యేకంగా ఎవరిని టార్గెట్ చేయాలని మా ఉద్దేశం కాదు - ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తి పారదర్శకంగా జరగాలన్నదే మా భావన అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ రమా వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి కళ్యాణం

కళ్యాణోత్సవంలో ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఎస్.కోట పట్టణంలోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో ప్రతిష్టింపబడ్డ శ్రీరమా వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి కళ్యాణోత్సవం ఆదివారం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రాజుగారు, సుబ్బలక్ష్మి దంపతులు, కర్నాటక సోమనాయుడు దంపతులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు. ఈ కళ్యాణాన్ని ఆలయ అర్చకుడు దేవరభట్ల హరి వికాస్ శర్మ, స్థానిక పురోహితుడు విన్నకోట శ్రీనివాసరావులు వేద మంత్రోచ్చారణలతో అంగరంగ వైభవంగా జరిపించారు. భక్తులకు స్థానిక ఆలయ కమిటీ సభ్యులు మాలి బాబూలాల్, మద్ది కృష్ణ తదితరులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేటి విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచాలి

ఆశయ రూరల్ లైబ్రరీ అధ్యక్షుడు రెడ్డి రమణ

విశాలాంధ్ర-గరివిడి: మండలంలో మందిరి వలస గ్రామంలో రచ్చ బండ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆశయ యూత్ అసోషియేషన్, ఆశయ రూరల్ లైబ్రరీ వారి ఆధ్వర్యంలో మొబైల్ బైక్ లైబ్రరీ పర్యటన చేపట్టారు. కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ మాట్లాడుతూ నేటితరం విద్యార్థులలో పఠనం ఆసక్తి పెంచేవిధంగా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని వారికి మొబైల్ ఫోన్ కు దూరం గా వుంచాలని మంచి పుస్తకాలు కొని ఇల్లునే గ్రంథాలయాలు గా ఏర్పాటు చేయాలని రోజు కు రెండు గంటలు పుస్తకాలు చదవడం అలవాటుగా చేయాలని పిల్లల్లో ఆలోచన శక్తి పెరుగు తుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంపై శిక్షణ

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖ గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిభిరంలో భాగంగా చదవడం మాకిష్టం, అలాగే చిత్రలేఖనం పై శిక్షణ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా విశ్రాంతి ఎంఈఓ ఎం.సత్యాన్నారాయణ మరియు కె. విస్సు విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. ప్రతి విద్యార్థి బొమ్మలు గీయడం నేర్చు కోవాలని భవిష్యత్తు లో సైన్సు సబ్జక్టు తీసుకొనువారు బొమ్మలు గీసేందుకు ఇది ఉపకరిస్తుంది అని వారు సూచించారు. ఈ డ్రాయింగ్ పోటీలకు కావలసిన గ్రాఫ్ట్ పిస్తాకాలు దత్తి సత్యాన్నారాయణ బహుకరించారు. ఈ కార్యక్రమానికి ఐదవ అంగనవాడి టీచర్ వై. శ్రీదేవి పాల్గొన్నారు అని స్థానిక గ్రంథాలయ అధికారి సి. హెచ్ కృష్ణమూర్తి తెలిపారు.

వైభవంగా శ్రీ సరేపోలమ్మ అమ్మవారి ఉత్సవాలు

విశాలాంధ్ర-బొబ్బిలి: ఈనెల 20న పాత బొబ్బిలి గ్రామంలో సోమవారం అంగడివద్ద కోదూరు వాస్తవ్యులతో బాగోతం ప్రదర్శన, గ్రామ, పుర ప్రజలు మరియు బంధుమితులతో శ్రీ సరేపోలమ్మ అమ్మవారి ఘటలు అమ్మవారి గది నుండి అమ్మవారి అంగడి వద్దకు చేరుకొని, అక్కడ మందుగుండు సామగ్రితో, గ్రామపెద్దల సూచనలతో యువకుల తొర్పాటుతో తొలేళ్ళ సంబరాలు నిర్వహిస్తున్నారని, 21న మంగళవారం అమ్మవారి అంగడి వద్ద బుర్రకథ ఏర్పాటు, గ్రామ పురప్రజల సహకారంతో పాతబొబ్బిలి నుండి బయలుదేరి బొబ్బిలి పురవీధుల్లో, కడప వాస్తవ్యుల నుండి తెచ్చిన కనువిందులతో మీరమిట్లు కొలిపే భారీ ప్రభలతో, విరఘట్టం గ్రామ వాస్తవ్యుల బళ్లావేషాలతో, భారీ లైట్ సెట్టింగ్లతో, అమ్మవారి సిరిమాను పాతబొబ్బిలి అమ్మవారి గది నుండి బయలుదేరి బొబ్బిలి పుర వీధుల్లో తిరుగుతూ అమ్మవారి దర్శన భాగ్యం అందరికి కల్గించి తిరిగి దేశితల్లి అమ్మవారి గుడి వద్దకు చేర్నుంటారు. 22న బుధవారం ఘటలు, ప్రభలు మందుగుండు సామాగ్రితో అమ్మవారి గది నుండి సరే పోలమ్మ వారి గుడికి అందరూ చేరుకొని అమ్మవారిని గుడిలో ఉంచి అమ్మవారి అంపకోత్సవం పూర్తి చెయ్యడం జరుగుతుందని ఆలయ ధర్మకర్త చోడిగంజి రమేష్ నాయుడు తెలిపారు.

పాత బొబ్బిలి, గొల్లపల్లి ప్రజలు పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి : డీఎస్పీ

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలో పాత బొబ్బిలి, గొల్లపల్లి గ్రామాల ప్రజలు పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎన్నికల కోడ్ అమలులో ఉందని పోలీసులు నిబంధనలు పాటించి ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ అధికారులకు సహకరించాలని డీఎస్పీ శ్రీనివాసరావు,సిఐ నాగేశ్వరరావు కోరారు. ఆదివారం పాత బొబ్బిలిలో పండుగ నిర్వాహణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఇటివల రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో శాంతి భద్రతలకు విఘాతం జరిగిందని డీజేలు సౌండ్ సిస్టమ్ వాడొద్దని, డెన్స్ బేబీ లాంటి స్టేజ్ ప్రోగ్రామ్స్ పెట్టవద్దని నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా వాసవీమాత జన్మదిన వేడుకలు

పాల్గొన్న ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణ కేంద్రంలో నిర్వహించిన ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత శ్రీవాసవి అమ్మవారి 1032వ జన్మదిన వేడుకల్లో శృంగవరపుకోట నియోజకవర్గ ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి ముఖ్యఅతిధిగా ఆదివారం పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ఆశీస్సు లు తీసుకొని అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ఆర్యవైశ్య భక్తులు పాల్గొన్నారు.

దేవాదాయ భూములను వదిలేశారా..!

జామిలో జోరుగా భూముల విక్రయాలు
రిజిస్ట్రేషన్ లేకపోయినా కొనుగోలుకు సిద్ధం
ఏళ్ళ తరబడి శిస్తులు సైతం వసూలు చేయని అధికారులు

విశాలాంధ్ర-జామి: మండలంలోని పలు గ్రామాలలో దేవాదాయశాఖకు చెందిన వందలాది ఎకరాల భూములు ఉన్నాయి. ఇవన్నీ ప్రస్తుతం రైతుల సాగులోనే ఉన్నాయి. భూములకు ఒక్కసారిగా ధరలు పెరగడంతో రియల్ వ్యాపారులు దేవాదాయ భూములపై కన్నేశారు. రిజిస్ట్రేషన్ కాకపోయినా పర్వాలేదని, తాము చూసుకుంటామని నచ్చజెప్పి రైతులకు అదిక ధరను ఇచ్చి సొంత చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఈతరహా కొనుగోల్లు జోరందుకున్నాయి. వాస్తవానికి దేవాదాయశాఖకు చెందిన భూములను నిభందనల మేరకు రైతుల సాగుకు ఇచ్చేందుకు వేలం విదానాన్ని నిర్వహిస్తారు. కానీ జామిలో ఇటువంటి వేలం నిర్వహించిన దాఖలాలు లేవు. జామిలోని త్రిపురాంతకస్వామికి, శ్రీవేణుగోపాల స్వామికి, అలాగే ఎల్లారమ్మ తల్లికి కొంత భూమి వుందని చెబుతుంటారు. కానీ ఈభూములపై ఏరోజు దేవాదాయ శాఖ అధికారులు శిస్తులు వసూలు చేసినట్లు కనిపించలేదు. ఇక జామిలోని మరో ప్రాంతంలో సింహాచలం దేవస్థానికి చెందిన భూములని, అలాగే విశాఖలోని ఓ ఆలయానికి చెందిన భూములని, మాన్యం భూములుగా చెబుతుంటారు. కానీ ప్రస్తుతం ఈభూములు రియల్ వ్యాపారుల చేతిలోకి వెళ్ళిపోతున్నాయి. మరికొందరు ఇంటి నిర్మాణాలు శాశ్వతపద్దతిలో చేపడుతున్నారు.

అధికారులు ఎందుకు పట్టించుకోవట్లేదు..?

జామికి సంభందించిన దేవాదాయ భూములపై అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. ఆలా ఏళ్ళ క్రితం జామి శివాలయంకు చెందిన భూములపై కరపత్రాలను విడుదల చేసారు. శివాలయంలో సమావేశం సైతం నిర్వహించారు. అనంతరం అధికారులు పత్తా లేకుండా పోయారు. ఇప్పటికైనా దేవాదాయశాఖ అధికారులు జామిలోని తమ శాఖకు చెందిన భూములపై పరిశీలన చేస్తే అసలు వాస్తవాలు బైటపడతాయని పలువురు అంటున్నారు.

కూచిపూడి నృత్యంలో రాణిస్తున్న ఎస్.కోటకు చెందిన కొప్పాక శ్రీశ్రేష్ఠ

దేశ విదేశాల్లో ఇప్పటివరకు 270 పైచిలుకు నృత్య ప్రదర్శనలు
థాయిలాండ్ దేశంలో నిర్వహించిన ఆసియా కాంక్లేవ్ నృత్య ప్రదర్శనలో ప్రథమస్థానం
జాతీయస్థాయిలో కూచిపూడిలో నంది అవార్డు సాధించిన శ్రీశ్రేష్ఠ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణానికి చెందిన శ్రీఉష్రశ్రీ లాడ్జి యజమాని కొప్పాక గంగాధర నరసింహమూర్తి, లక్ష్మీ దీప్తి దంపతుల కుమార్తె కొప్పాక శ్రీశ్రేష్ఠ కూచిపూడి నృత్య ప్రదర్శనలో రాణిస్తూ దేశ విదేశాల్లో ప్రదర్శనలు ఇస్తోంది. కొప్పాక శ్రీశ్రేష్ఠ ప్రస్తుతం విశాఖపట్నంలోని విశాఖ వాలీ స్కూల్లో 9వ తరగతి చదువుతోంది. శ్రీశ్రేష్ఠ బాల్యం నుంచి కూచిపూడి శాస్త్రీయ నృత్యం పట్ల ఆసక్తి చూపిస్తుండటంతో నాట్య గురువు కూచిపూడి నాగచందన దగ్గర చందాన డాన్స్ అకాడమీ (వైజాగ్) లో తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించారు. శ్రీశ్రేష్ఠ ఇప్పటివరకు 270 పైచిలుకు ప్రదర్శనలు ఇచ్చారు. భారతదేశంతో పాటు మలేషియా, థాయిలాండ్ (బ్యాంకాక్) వంటి ఇతర దేశాలలో కూడా ఈ చిన్నారి ప్రదర్శనలు ఇచ్చి పలు అవార్డులుతో పాటు పలువురి నుండి అభినందనలు అందుకుంది. ఇటీవల జరిగిన అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీ ఏపీ భవన్ వద్ద ఇచ్చిన నృత్య ప్రదర్శనకు గాను నంది అవార్డు గెలుచుకుంది. థాయిలాండ్ (బ్యాంకాక్) లో ఆసియా దేశాల కల్చరల్ కాంక్లేవ్ లో తరంగం (ప్లేట్ డాన్స్)లో ప్రదర్శనలు ఇచ్చి చూపరులను ఆకట్టుకొని శ్రీశ్రేష్ఠ ప్రథమ బహుమతి గెలుపొందింది.

రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా శ్రీశ్రేష్ఠ ప్రదర్శనలు..

హైదరాబాద్-స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ , ఏలూరు, చిన్న తిరుపతి, అన్నవరం, రామనారాయణం, అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, ఇస్కాన్ వైజాగ్, సంపత్ వినాయక దేవాలయం, కనక మహాలక్ష్మి ఆలయం, కైలాసగిరి-శివాలయం, విజయవాడ-దుర్గా దేవాల యం, సామర్లకోట - భీమలిం గేశ్వరాలయం, విశాఖ లోని టిటిడి రుషికొండ, సింహాచలం ఆలయం, భద్రాచలం - శ్రీరామ దేవాలయం, షిర్డీ - శ్రీ సాయిబాబా ఆలయం, శ్రీశైలం - శ్రీ మల్లికార్జున దేవాలయం, కటక్, భద్రాచలం, శ్రీశైలం, షిర్డీ వంటి వివిధ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలు, నగరాల్లో కూచిపూడి శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శించారు. కళాభారతి, మద్దిలపాలెం, రవీంద్ర భారతి-హైదరాబాద్. పొట్టి శ్రీరాములు ఆడిటోరియం, మరియు ఇతర రాష్ట్రాలలో కూడా ప్రదర్శనలు ఇచ్చింది . కలకత్తా, ఒరిస్సా, హైదరాబాద్ మరియు నవంబర్, 2022 నెలలో మలేషియాలో అంతర్జాతీయ ప్రదర్శన ఇచ్చింది. డిసెంబర్ 2023, గచ్చిబౌలి స్టేడియంలో 4000 మందితో కలిసి చేసిన బృంద నాట్యంకి గాను గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ గెలుచుకుందని తండ్రి కొప్పాక గంగాధర్ నర్సింహమూర్తి వెల్లడించారు.

థాయిల్యాండ్‌లో అవార్డు అందుకుంటున్న శ్రీశ్రేష్ఠ

- శ్రీశ్రేష్ఠ అందుకున్న అవార్డులు ఇలా..

శిఖరం ఆర్ట్స్ థియేటర్ వారి శ్రీక్రోధి ఉగాది నేషనల్ అవార్డుకి ఎంపికయ్యింది. విశాఖ బాలమిత్ర అవార్డు. జెవిఎస్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ నుండి లాస్య మయూరి అవార్డు, భరత్ ఆర్ట్స్ అకాడమీ నుండి గిన్నిస్ వరల్డ్ రికార్డ్, కళాశ్రయ్ మంచ్ ఆన్‌లైన్ ఇండియన్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ కాంపిటీషన్ నుండి స్టార్ పెర్ఫార్మ్ అవార్డు, అక్షయ సేవా సాంస్కృతిక సంఘం నుండి నాట్య కళా నందిని అందుకున్నారు.

మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు నుంచి అవార్డు అందుకుంటున్న కొప్పాక శ్రీశ్రేష్ఠ

శ్రీశ్రేష్ఠ గెలుపొందిన బహుమతుల వివరాలిలా..

స్వామి వివేకానంద ఫౌండేషన్ అఫ్ ఆర్ట్స్ & కల్చర్ జాతీయ స్థాయిలో 2022లో ప్రథమ బహుమతి గెలుపొందింది. గ్లోబల్ కల్చరల్ కాంటెస్ట్-2022లో ప్రథమ బహుమతి గెలుచుకుంది. వరల్డ్ చిల్డ్రన్ కాంటెస్ట్- 2022లో మొదటి బహుమతి గెలుపొందింది. ఆలిండియా సోషల్ డిస్టెన్స్ ఆన్లైన్ నేషనల్ సోలో డాన్స్ కాంటెస్ట్-2020లో రెండవ బహుమతి. 33వ అల్ ఇండియా నేషనల్ డాన్స్ కాంపిటీషన్ (బై నాట్యరవళి) మూడవ బహుమతి, ఇంటర్నేషనల్ లెవెల్ ఇండియన్, క్లాసికల్ డాన్స్- ఆంగికం ఆర్గనైజ్డ్ బై ఎన్సీఎన్ కళాక్షేత్రం వారి మూడవ బహుమతిని అందుకుంది. కొప్పాక శ్రీశ్రేష్ఠ వీటితో పాటు మరెన్నో బహుమతులను, అవార్డులు సాధించటం పట్ల ఎస్ కోట మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఢిల్లీ ఏపీ భవన్ లో నంది అవార్డు అందుకుంటున్న చిన్నారి కొప్పాక శ్రీశ్రేష్ఠ